క్లుప్తంగా

రెస్టారెంట్ ఏర్పాటు చేయడం అభినందనీయం



రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండ: బంగారు వాకిలి ఫ్యామిలీ రెస్టారెంట్ నల్లగొండలో ఏర్పాటు చేయడం అభినందనీయమని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నల్లగొండలోని శివాజీనగర్‌లో ఏర్పాటు చేసిన రెస్టారెంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, అబ్బగోని రమేష్‌గౌడ్, నర్సింగ్ శ్రీనివాస్, వంగాల అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

2,3 తేదీల్లో క్రీడాపోటీలు

మర్రిగూడ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సెప్టెంబర్ 2,3 తేదీల్లో ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో బిట్టు శ్రీను తెలిపారు. శుక్రవారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అండర్-14, 17 విభాగాల్లో క్రీడలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కబడ్డీ అండర్-14 బాలికల విభాగంలో 48కేజీల బరువు, బాలురు 51కేజీలు, అండర్-17 విభాగంలో బాలికలు, బాలురు 55కేజీలు ఉన్న వారు అర్హులని తెలిపారు. క్రీడల్లో పాల్గొనే విద్యార్థులు మర్రిగూడ జెడ్పీహెచ్‌ఎస్ పీడీ వేదవతిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో పీడీలు వాసుదేవరావు, వేదవతి, చిన్న జంగయ్య, నరసింహ, రాంనరేష్ పాల్గొన్నారు.

రథం తయారీకి విరాళం



విరాళం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గట్టుప్పల్ : మండల కేంద్రంలోని వినాయకుడి విగ్రహం ఊరేగింపు రథం తయారీకి తేరట్‌పల్లి గ్రామ మాజీ సర్పంచ్ వీరమళ్ళ శ్రీశైలం రూ.90 వేలను శుక్రవారం కాంగ్రెస్ నాయకుల ద్వారా యూత్ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నామని జగన్నాథం, చెరుపల్లి సత్తయ్య, నామని బుచ్చయ్య, భీమగాని మల్లేశం, చెరుపల్లి ఆంజనేయులు, పగిళ్ళ యాదయ్య, నరేందర్‌గౌడ్, శంకరయ్య, మల్లేశం పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన

నల్లగొండ టూటౌన్: జిల్లాకు చెందిన ఆరుగురు క్రీడాకారులు సౌత్ జోన్ తైక్వాండో పోటీల్లో 4 బంగారు పతకాలు 2 వెండి పతకాలు సాధించారు. ఈ సందర్భంగా వారిని అదనపు ఎస్పీ రమేష్ శుక్రవారం అభినందించారు.కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి అక్బర్ అలీ, విమల, ఎండీ యానుస్ కమాల్, హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు కరీం పాల్గొన్నారు.

పీపీఆర్ టీకాలు వేయించాలి

తిప్పర్తి : గొర్రెలకు, మేకలకు పీపీఆర్ వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డా.రమేష్ రైతులకు సూచించారు. శుక్రవారం తిప్పర్తి మండలంలోని సిలార్‌మియాగూడెం గ్రామంలో టీకాలు వేసే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. వచ్చేనెల పదో తేదీ వరకు జిల్లాలోని అన్ని గ్రామాల్లో జీవాలకు టీకాలు వేసే కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. మండల పశువైద్యాధికారి యశ్వంత్ పాల్గొన్నారు.

టీవీ బహూకరణ



టీవీ అందిస్తున్న కొరివి వెంకన్న,అరుణ దంపతులు

చిట్యాల : మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డులో గల అంగన్‌వాడీ కేంద్రానికి చిట్యాల పట్టణానికి చెందిన కొరివి వెంకన్న-అరుణ దంపతులు శుక్రవారం స్మార్ట్ టీవీ అందజేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునిత, హెచ్‌ఎం అంబటి సత్తయ్య, అంగన్‌వాడీ టీచర్లు అపర్ణ, అరుణ, జ్యోతి, ఉపాధ్యాయులు బాదం భిక్షపతి, గీత పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కేబుల్ వైర్లు

- ఏ స్తంభానికి చూసినా చిక్కుముళ్లుగా తీగలు
- పొరపాటున ఎవరికైనా తగిలితే షాక్‌కు గురయ్యే అవకాశం
- గణేశ్ విగ్రహాల తరలింపునకు ఆటంకాలు

నల్లగొండ టూటౌన్: నీలగిరి పట్టణంలో ప్రధాన రహదారులతోపాటు కాలనీల్లో విద్యుత్ స్తంభాలకు ఉన్న కేబుల్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. పట్టణంలోని ఏ విద్యుత్ స్తంభాన్ని చూసినా పైనుంచి కింది దాకా వివిధ కంపెనీల కేబుల్ వైర్లు వేలాడుతున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇటీవల హైదరాబాద్ నగరంలో విద్యుత్ స్తంభాలపై కేబుల్ వైర్లు తగిలి షాక్‌కు గురై నలుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. నీలగిరి పట్టణంలో పరిస్థితులు ప్రమాదకరంగా ఉన్నా సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు ప్రమాదాల నివారణపై సారించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వినాయక చవితి ఉత్సవాలను పట్టణంలో భారీ ఎత్తున నిర్వహించేందుకు యువత, వినాయక ఉత్సవ సమితి సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. విగ్రహాలను నిమజ్జనానికి తీసుకెళ్లే సమయంలో విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన కేబుల్ వైర్లు తగిలే అవకాశం ఉంది.

విద్యుత్ సిబ్బందికీ ఇబ్బందే..

ప్రధాన రహదారుల వెంట ఉన్న స్తంభాలతోపాటు వివిధ కాలనీల్లో విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన అనేక రకాల కంపెనీల నెట్ కేబుల్ వైర్లు చిక్కుముళ్లుగా ఉన్నాయి. ఇలాంటి చిక్కుముడుల వల్ల విద్యుత్ శాఖ సిబ్బందికి కూడా ఇబ్బందికరంగా మారింది. కరెంట్ స్తంభంపై నుంచి వేలాడుతున్న ఈ కేబుల్ వైర్లు పొరపాటున ప్రజలకు తగిలితే విద్యుత్ షాక్ తగిలి ప్రమాదం చోటుచేసుకునే అవకాశం ఉంది. సంబంధిత నెట్ కంపెనీ వారు ఇష్టానుసారంగా ఏర్పాటు చేసి కేబుల్ వైర్లు ప్రజల ప్రాణాలకు ముప్పు తెచ్చే ప్రమాదం లేకపోలేదనే చర్చ నడుస్తోంది. హైదరాబాద్‌లో చోటుచేసుకున్న ఘటన తర్వాత కూడా జిల్లా కేంద్రంలో సంబంధిత అధికారులు కేబుల్ వైర్ల తొలగింపుపై దృష్టి సారించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎక్కడైనా ప్రమాదం జరిగిన తర్వాతనే అధికారులు స్పందిస్తారా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. వినాయక చవితి ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత శాఖల అధికారులు విద్యుత్ స్తంభాలకు వేలాడుతున్న వైర్లను తొలగించాల్సిన అవసరం ఉందని పట్టణ ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే శాంతి సంఘం సమావేశంలో డీఎస్పీ, రెవెన్యూ శాఖ అధికారులు విద్యుత్ స్తంభాలపై ఉన్న కేబుల్ వైర్లను తొలగించాలని కేబుల్ వైర్ల యజమానులను ఆదేశించినట్లు తెలిసింది. అయితే సంబంధిత కేబుల్ యజమానులు కేబుల్ వైర్ల తొలగింపునకు ఎలాంటి చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు.



ప్రకాశంబజార్ మూల మలుపు వద్ద స్తంభాలకు అడ్డగోలుగా ఉన్న కేబుల్ వైర్లు



శాంతినగర్‌లో ఐవోబీ బ్యాంకు వద్ద..

మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేస్తాం

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నార్కట్‌పల్లి: మండల కేంద్రంలోని పెద్ద చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా రూపొందించి అభివృద్ధి చేస్తామని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శుక్రవారం నార్కట్‌పల్లిలో నీటిపారుదల శాఖ అధికారులతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సుమారు రూ.20 కోట్ల నిధులతో మినీ ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేస్తామని, అందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులకు సూచించారు. వాకింగ్ ట్రాక్, లైటింగ్, గార్డెన్, 20 ఫీట్ల రోడ్డు ఏర్పాటు చేస్తామన్నారు. బతుకమ్మలను చెరువులో వేసేందుకు ప్రత్యేక స్థలం ఏర్పాటు చేయాలన్నారు. చెరువు ఇరువైపులా బఫర్ జోన్ గుర్తించి హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. చెరువులోకి వరద నీరు వచ్చేలా చేయాలని సూచించారు. బ్రాహ్మణవెల్లెంల, ఉదయసముద్రం ప్రాజెక్టుకు ఇరువైపులా భూసేకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ డీఈలు విఠలేశ్వర్, మారం శ్రీనివాస్, ఏఈఈలు రాజశేఖర్, నవీన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీరేశం

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న డీఈఓ

చిట్యాల : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డీఈఓ బొల్లారం భిక్షపతి ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం చిట్యాల మండలంలోని ఉరుమడ్ల, ఎలికట్టె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ఎలికట్టె ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మధ్యాహ్న భోజనం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలన్నారు. ఉరుమడ్ల హైస్కూల్‌లో గణితం, హిందీ, సైన్స్ సబ్జెక్టుల్లో విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. విద్యార్థులు ఆంగ్లంపై పట్టు సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు వెంకట్‌రెడ్డి, నర్సింహ, శ్రీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూరియా సరఫరా చేయాలని ధర్నా



మునుగోడు : నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

నార్కట్‌పల్లి: రైతులకు సకాలంలో యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ నార్కట్‌పల్లి తహసీల్దార్, వ్యవసాయ కార్యాలయాల ఎదుట శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లోడంగి శ్రావణ్‌కుమార్ పాల్గొని మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యూరియా సరఫరా చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. కొంతమంది వ్యాపారులు యూరియాను అధిక రేట్లకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి పెండ్యాల శంకర్, వంగాల నాగయ్య, దశరథ, ఆలకుంట నరసింహ, శ్రీపతి స్వామి, వెంకటాచారి, ఎనుగుల యోగేంద్ర రెడ్డి, బోడ మల్లేష్, దుబ్బ మల్లేష్ పాల్గొన్నారు.

మునుగోడు: రైతులకు సరిపడా యూరియా అందించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి గుర్జ రామచంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం రైతు సంఘం నాయకులు స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామచంద్రం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి సరిపడా యూరియా అందించకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, బి.లాలు, బండమీది యాదయ్య, మందుల పాండు, గోసుకొండ లింగయ్య, వనం వెంకన్న, బి.మల్లమ్మ, దుబ్బ వెంకన్న పాల్గొన్నారు.

నాంపల్లి: మండలంలోని రైతులకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉంచాలని తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి నేతల రాజు డిమాండ్ చేశారు. నాంపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం రైతులతో కలిసి నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి సూదనబోయిన రమేష్, వ్యవసాయ మండల కార్యదర్శి నేరెళ్ల సైదయ్య, కానుగుల మహేష్, కోరె సత్తయ్య, కోరె అంజయ్య కృష్ణయ్యలు పాల్గొన్నారు.

చండూరు : రాష్ట్రాలకు యూరియా అందించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్, సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు నలపరాజు రామలింగయ్య ఆరోపించారు. రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రైతు సంఘం ఆధ్వర్యంలో చండూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి పల్లె యాదయ్య, నాయకులు ఊషయ్య, వెంకన్న, రమేష్,శ్రీను, శంకరయ్య, భిక్షం, లింగస్వామి, జగన్, దశరథ, లక్ష్మీనర్సింహ, యాదగిరిరెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

కేతేపల్లి: పేద ప్రజల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందాల ప్రమీల అన్నారు. శుక్రవారం కేతేపల్లిలో నిర్వహించిన సీపీఎం మండల సమావేశంలో ఆమె మాట్లాడారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ బోళ్ల నర్సింహారెడ్డి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ చినవెంకులు, మండల కార్యదర్శి సీహెచ్.లూర్థు మారయ్య, నాయకులు ఏళ్ళ అశోక్‌రెడ్డి, కోట లింగయ్య, అల్లి ప్రభాకర్, కర్ర బాలయ్య, గాదె సత్తిరెడ్డి, నాగయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

పోస్టు కార్డు ఉద్యమం

నల్లగొండ: ఓటు చోరీకి వ్యతిరేకంగా రాహుల్ గాంధీ చేపట్టిన ఉద్యమానికి మద్దతుగా శుక్రవారం ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నల్లగొండలోని నాగార్జున డిగ్రీ కళాశాలలో పోస్ట్ కార్డు ఉద్యమం చేపట్టారు. రాష్ట్రపతికి తెలిపేలా పోస్ట్ కార్డులు పంపామని ఎన్‌ఎస్‌యూఐ జిల్లా నాయకుడు అల్లి అంజన్‌యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు బైరు ప్రసాద్‌గౌడ్, గోయల్, హర్ష, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



కేతేపల్లి: భీమారంలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



నల్లగొండ టూటౌన్: ఎంజీయూలో..

నల్లగొండ టూటౌన్: ఎంజీ యూనివర్సిటీలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి తెలుగు ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు ఎం.ఆనంద్, మద్దిరాల సత్యనారాయణరెడ్డి, అనితకుమారి, జి.నరసింహ, విద్యార్థులు పాల్గొన్నారు.

చండూరు : గిడుగు వెంకటరామమూర్తి జయంతిని పురస్కరించుకుని చండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ప్రహ్లాద చరిత్ర, గజేంద్ర మోక్షం అనే పుస్తకాలను జీహెచ్‌ఎం కోటేశ్వర్‌రెడ్డి, తెలుగు ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. మద్దోజు సుధీర్‌బాబు, మజీద్, ఎలిజబెత్ పాల్గొన్నారు.

కేతేపల్లి మండలంలో..

కేతేపల్లి: తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని భీమారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో వ్యవహార భాష పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.భిక్షయమ్మ, ఉపాధ్యాయులు రాపోలు పరమేష్, బత్తుల జానకిరెడ్డి, జి.రమేష్, కన్నె శివయ్య, ఎల్.శ్రీధర్,డి.నాగయ్య, జూనియర్ అసిస్టెంట్ సుమన్, అహ్మద్ పాల్గొన్నారు.

ఇంటింటికీ తిరిగి దరఖాస్తులు స్వీకరించండి

నల్లగొండ: ప్రతి పంచాయతీ కార్యదర్శి, మున్సిపల్ వార్డు ఆఫీసర్ ఇంటింటికీ తిరిగి జాతీయ కుటుంబ ప్రయోజన పథకం దరఖాస్తులు స్వీకరించాలని ఆర్డీఓ అశోక్‌రెడ్డి అన్నారు జాతీయ కుటుంబ ప్రయోజన పథకంపై రెవెన్యూ అధికారులతో శుక్రవారం ఆర్డీఓ అశోక్‌రెడ్డి తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లగొండ డివిజన్ పరిధిలోని 9 మండలాలు, 3 మున్సిపాలిటీలకు సంబంధించి 2017 ఏప్రిల్ 12 నుంచి ఈ నెల 23వ తేదీ వరకు మృతి చెందిన వారు 2249 మంది ఉన్నారని తెలిపారు. మున్సిపాలిటీలో 13,979 మంది చనిపోయారని.. గ్రామాలు, మున్సిపాలిటీల్లో కలిపి 16, 228 మంది చనిపోయినట్లు పేర్కొన్నారు. మరణించిన కుటుంబాల నుంచి 2514 దరఖాస్తులు తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో అందాయన్నారు. వాటిని విచారించి 1244 దరఖాస్తులు అర్హత కలిగి ఉన్నాయని, 207 దరఖాస్తులు వివిధ కారణాలతో తిరస్కరించామన్నారు. 1063 దరఖాస్తులు విచారించాల్సి ఉందన్నారు. ఇంకా మరణించిన కుటుంబాల నుంచి 13714 దరఖాస్తులు స్వీకరించాల్సి ఉందని తెలిపారు.

కొత్త కుంట గండిని వెంటనే పూడ్చాలి



తెగిన కుంట కట్టను పరిశీలిస్తున్న నాయకులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ మండలం కాజీరామారం గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తెగిన కొత్త కుంట కట్ట గండిని వెంటనే పూడ్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సమస్యలపై సర్వేలో భాగంగా సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామంలో తెగిన కుంట కట్టను పరిశీలించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పుచ్చకాయల నర్సిరెడ్డి, కొండ అనురాధ, మండల కార్యదర్శి నలుపరాజు సైదులు, కొండ వెంకన్న, బొల్లు రవీందర్, కండె యాదగిరి, కుందారపు సైదులు, కొత్త సైదులు, మేడబోయిన లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

మునుగోడు: అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని మేజర్ గ్రామ పంచాయతీ అయిన మునుగోడులో ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బండా శ్రీశైలం డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన పల్లెబాట కార్యక్రమంలో భాగంగా మునుగోడులో పర్యటించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. సీపీఎం మండల కార్యదర్శి సాగర్ల మల్లేష్, మండల కమిటీ సభ్యుడు మిర్యాల భరత్ కుమార్, యసరాని శ్రీను, యాటరాజు, గణేశ్, వంశీ, శ్రీకాంత్, వెంకన్న, పాలంచ సైదులు, రాములు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

మునుగోడు: భర్త చనిపోయి కుటుంబాన్ని పోషిస్తున్న మహిళకు ప్రభుత్వం అందించే జాతీయ కుటుంబ ప్రయోజన పథకాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎస్.నరేష్ కోరారు. శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు వితంతువుల నుంచి తహసీల్దార్ దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా 340 మంది దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

చండూరు : మున్సిపాలిటీ కేంద్రంతోపాటు మండలంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ మండల అధ్యక్షుడు ముదిగొండ ఆంజనేయులు, పట్టణ అధ్యక్షుడు పందుల సత్యంగౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు శుక్రవారం తహసీల్దార్, ఆర్‌డీఓ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్‌డీఓ శ్రీదేవికి, తహసీల్దార్ చంద్రశేఖర్‌కు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కోశాధికారి కాసాల జనార్దన్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జ్ బొడిగె అశోక్‌గౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు నకిరెకంటి లింగస్వామి, భూతరాజు శ్రీహరి, బోడ ఆంజనేయులు, సముద్రాల వెంకన్న పాల్గొన్నారు.

గట్టుప్పల్ : మండల పరిధిలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ నాయకులు శుక్రవారం ఎంపీడీఓ మాధవరెడ్డికి వినతి పత్రం అందజేశారు. లింక్ రోడ్లకు మరమ్మతులు చేయాలని, దోమలను నివారించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బచ్చనగోని దేవేందర్, బీజేపీ మండల అధ్యక్షుడు రావుల ఎల్లప్ప, కంపె దుర్గయ్య, సంపాల సుధాకర్, మారయ్య, ఇడం రాజు, శ్రీనివాసులు, మార్కెండేయ, పగిళ్ళ శ్రీను, భిక్షం, ప్రవీణ్, రాజు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

నల్లగొండ టౌన్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ.సలీం, యూనియన్ జిల్లా అధ్యక్షుడు పోలే సాంబయ్య, అవుతా రవీందర్, పోలే సత్యనారాయణ, వరికుప్పల ముత్యాలు, పొన్న అంజయ్య పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించండి

కట్టంగూర్ : విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని మండల ప్రత్యేక అధికారి సతీష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఆయన ఎంపీడీఓ జ్ఞానప్రకాశ్‌రావుతో కలిసి తనిఖీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో వార్డెన్ గుజ్జుల శంకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అశోక్, నర్సింహ పాల్గొన్నారు.

జాతీయ క్రీడా దినోత్సవం

రామగిరి(నల్లగొండ): ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కాలేజీలో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. ఎస్.ఉపేందర్, సీఓఈ బి.నాగరాజు, సీహెచ్.సుధాకర్, ఎన్ఎస్ఎస్ అధికారి ఎన్.కోటయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో అదనపు ఎస్పీ రమేష్

నల్లగొండ టూటౌన్: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నల్లగొండలో శుక్రవారం మేకల అభినవ్ అవుట్ డోర్ స్టేడియంలో వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. సుమారు 70 మంది ఉద్యోగులు పోటీల్లో పాల్గొన్నారు. పోటీలకు ముఖ్య అతిథిగా అదనపు ఎస్పీ రమేష్ హాజరై మాట్లాడుతూ.. హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతిని జాతీయ క్రీడా దినోత్సవంగా ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. క్రీడల అధికారి మహ్మద్ అక్బర్ అలీ, క్రీడాకారులు పాల్గొన్నారు.

చిన వెంకట్‌రెడ్డి చిత్రపటానికి ఘన నివాళి



చిన వెంకట్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి కోమటిరెడ్డి



నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నల్లగొండ: నల్లగొండలో శుక్రవారం కొండకింద చిన్నవెంకట్‌రెడ్డి దశదినకర్మ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరై చిన్నవెంకట్‌రెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నల్లగొండ టూటౌన్: నల్లగొండ పట్టణంలో శుక్రవారం నిర్వహించిన చినవెంకట్‌రెడ్డి దశదినకర్మకు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి హాజరై చిన వెంకట్‌రెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, కంచర్ల భూపాల్‌రెడ్డి, నాయకులు అభిమన్యు శ్రీనివాస్, బోనగిరి దేవేందర్, దేప వెంకటరెడ్డి పాల్గొన్నారు.

నూతన జడ్జీలకు స్వాగతం పలికిన న్యాయవాదులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ జిల్లా కోర్టులో నూతనంగా నియమితులైన రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి సాయి మేఘన, మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోటి సెరన్ తేజకు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కట్టా అనంతరెడ్డి, జనరల్ సెక్రటరీ మంద నగేష్, సీనియర్ న్యాయవాదులు నేతి రఘుపతి, మల్లేపల్లి ఆదిరెడ్డి, జి.జవహర్‌లాల్, కోశాధికారి బెరిగెల నగేష్, పాల్గొన్నారు.



నూతన జడ్జీలకు స్వాగతం పలుకుతున్న బార్ అసోసియేషన్ సభ్యులు

సుదీప్‌రెడ్డి కుటుంబ సభ్యులకు మంత్రి పరామర్శ

నల్లగొండ: పట్టణంలోని వీటీ కాలనీకి చెందిన మోదుగు సుదీప్‌రెడ్డి ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. కాగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శుక్రవారం సుదీప్‌రెడ్డి నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, వంగూరు లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

గణేశ్ నవరాత్రులు



నకిరేకల్: డాక్టర్స్ కాలనీలోని అక్షర గణపతి వద్ద కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు



నల్లగొండ పట్టణం ధాత్రినగర్‌లో కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు



చిట్యాల : పదో వార్డులో పూజలు చేస్తున్న మంజునాథ యువజన సంఘం సభ్యులు



నల్లగొండ: అలకాపురి కాలనీలో పూజలో పాల్గొన్న మహిళలు



నల్లగొండ: నాగార్జున కాలనీ రాంటెక్ అపార్ట్‌మెంట్‌లో ..